సాక్షి జనగామ

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



కేయూలో తరగతుల బహిష్కరణ

విద్యార్థి సంఘాల బాధ్యులపై అక్రమ కేసులను నిరసిస్తూ శనివారం కేయూలోని వివిధ విభాగాల్లో తరగతులను బహిష్కరించారు.

- 8లో ▸

పొదుపు పథకాలపై పెరిగిన వడ్డీ

చిన్న మొత్తాల పొదుపుపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేటు పెంచింది. అలాగే ఎంపిక చేసిన పొదుపు ఖాతాలకు అత్యధిక పొదుపు పరిధిని సవరించింది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37°/24°

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉన్నా ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. రాత్రి సమయంలో ఉక్కపోత ఉంటుంది.



న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నర్మెట: సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని జీసీడీఓ గౌసియా, ఎస్సై షేక్ జానీపాషా అన్నారు. సైబర్ అంబాసిడర్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కేజీబీవీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళా రక్షణ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థినులు తోటి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పావనిజయరాం, ఎస్ఓలు బైరోజు రజిత, ఎస్.రజిత, సైబర్ మెంటార్ ఉపాధ్యాయులు రజని, శ్యామల పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోండి



జనగామ: కంటి వెలుగు కార్యక్రమం ముగిసిన తర్వాత పీహెచ్‌సీ, ఇతర ప్రోగ్రాంలకు సంబంధించి తమ సేవలను ఉపయోగించుకోవాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు వారు శనివారం ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవీందర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో 26 మంది పని చేస్తున్నారని, కంటి వెలుగు శిబిరాలు ముగిసిన తర్వాత తొలగించకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఎండీ.జావీద్, ఎండీ.బాసిద్ అక్రమ్, పి.సువార్త, ఎ.సారిక, పి.యాకన్న, సోమశేఖర్, ముజమ్మల్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు కోరారు.

నేడు పాపన్న విగ్రహావిష్కరణ



దేవరుప్పుల: మండల పరిధి పెద్దమడూరులో బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ రూ.25 లక్షలతో చేపట్టిన శ్రీ కంఠమహేశ్వర ఆలయ సుందరీకరణ, మరమ్మతు పనులు, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్మారక విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఈ విషయమై శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గం ఆరాధ్య దైవం ఆలయ అభివృద్ధి, పాపన్న చరిత్ర భావితరాలకు తెలిపేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి



జనగామ: ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గారావు తెలిపారు. శనివారం పట్టణంలోని రెడ్డిస్ట్రీట్ ఈ–సేవ, అలాగే తరిగొప్పుల తహసీల్ పక్కన ఉన్న మీసేవ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2016 సంవత్సరం లోపు ఆధార్ నమోదు చేసుకున్న వారంతా ధ్రువీకరణ పత్రాలతో అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. లేని పక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవడంలో ఇబ్బందులకు అవకాశం ఉంటుందన్నారు. ఆధార్ నవీకరణకు జిల్లా వ్యాప్తంగా మీ–సేవా కేంద్రాలతోపాటు బ్యాంకులు, పోస్టాఫీసులు, తహసీల్దార్ కార్యాలయాలు ఇలా 40 చోట్ల సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అవసరమైన చోట ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆధార్ నవీకరణ, సవరణల విషయంలో యూఐడీఏఐ ఆదేశాలను కేంద్రాల నిర్వాహకులు పాటించాలని అన్నారు.

స్ప్రింగ్‌స్ప్రీ–23 వేడుకలకు యాంకర్ సుమ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని వేడుకల్లో యాంకర్ సుమ కనకాల సందడి చేయనున్నట్లు పీఆర్వో రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు మధ్యాహ్నం నిట్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో విద్యార్థులతో 'లెట్స్ టాక్ సుమ' అంటూ అలరించనున్నట్లు పేర్కొన్నారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

రేపటి నుంచి ప్రారంభం
- హాజరుకానున్న 6,748 మంది విద్యార్థులు
- 42 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు
- ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయండి : కలెక్టర్



పరీక్ష కేంద్రంలో రిపోర్టు చేసిన ఇన్విజిలేటర్లు



సోషల్‌వెల్ఫేర్ సెంటర్‌లో హాల్‌టికెట్ నంబరింగ్..

జనగామ: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. 6,748 మంది విద్యార్థులు(బాలురు 3,263, బాలికలు 3,485) పరీక్షలు రాయనుండగా.. 42 సెంటర్లు(జనగామ నియోజకవర్గంలో 16, పాలకుర్తి 9, స్టేషన్‌ఘనపూర్ 17) ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల హాల్ టికెట్ నంబర్ల కేటాయింపు పూర్తయింది. తాగునీటి సౌకర్యం, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితరాలు అందుబాటులో ఉంచడానికి చర్యలు చేపట్టారు.

సిబ్బంది కేటాయింపు ఇలా..

42 కేంద్రాల్లో ఒక్కొక్కరి చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, 43 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 42 మంది సిట్టింగ్ స్క్వాడ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 384 మంది ఇన్విజిలేటర్లు, 84 మంది అటెండర్లు, 84 మంది వాటర్‌మన్‌లు, వైద్య సిబ్బంది సేవలందించనున్నారు.

జిరాక్స్ కేంద్రాల మూసివేత

పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల సమీపాన ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయాల్సి ఉంటుంది. విద్యార్థులు సెంటర్‌లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లడానికి అనుమతి లేదు.

సీసీ కెమెరాల నిఘా

అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్న పత్రాల సీల్‌ను ఓపెన్ చేస్తారు. పరీక్ష ముగిసిన తర్వాత పేపర్లను ప్యాకింగ్ చేసి పోస్ట్ ఆఫీస్‌లో భద్రపరిచేలా ఏర్పాట్లు చేశారు.

సెంటర్ల వద్ద బందోబస్తు

పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుంది. పరీక్ష సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పోలీసులు సెంటర్ బయటనే బందోబస్తు చేయాలే తప్ప.. లోనికి అనుమతి లేదని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు నిర్దేశిత పరీక్ష సమయానికి గంట ముందుగానే ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష సమయంలో ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు నడిపించనుంది.

సందేహాల నివృత్తికి కంట్రోల్ రూమ్

విద్యార్థులు సందేహాలుంటే నివృత్తి చేసుకోవడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు 6304062768 నంబర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.



పరీక్షలు ప్రశాంతంగా రాయాలి : కలెక్టర్

విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో రాయాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. పరీక్షల నిర్వహణపై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకుంటే.. రిలాక్స్ కావచ్చని సూచించారు. పరీక్ష సమయంలో తల్లిదండ్రులు పిల్లలను భయాందోళనకు గురి చేయకుండా మానసికంగా సిద్ధం చేసి సెంటర్‌కు పంపించాలని సూచించారు. విద్యార్థులు కూడా అనవసర ఆందోళనకు గురికావొద్దని అన్నారు.

‘బలగం’ మొగిలయ్యను పరీక్షించిన ఎంజీఎం వైద్యబృందం

సాక్షి కథనానికి స్పందించిన మంత్రి హరీశ్‌రావు
- సంరక్ష ఆస్పత్రికి వెళ్లిన వైద్యులు
- డయాలసిస్ తీరు పరిశీలన
- అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తామని హామీ



మొగిలయ్యను పరామర్శిస్తున్న ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యబృందం

కాశిబుగ్గ: వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న 'బలగం'సినిమాలో నటించి, పాటతో మెప్పించిన మొగిలయ్యను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని వైద్య బృందం శనివారం పరామర్శించింది. మొగిలయ్య దీన పరిస్థితిపై 'సాక్షి'లో ఇటీవల 'ఆపదలో ఉన్నాం.. తోడుగా నిలవండి'శీర్షికన ప్రచురితమైన మానవీయ కథనానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పందించారు. మొగిలయ్యకు ప్రభుత్వం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని వైద్యబృందం, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ నాయకేలు సంరక్ష ఆస్పత్రికి చేరుకొని మొగిలయ్యను పరామర్శించారు. ఆయనకు అందుతున్న వైద్య సేవల గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మొగిలయ్య గత సెప్టెంబర్ నుంచి రెండు కిడ్నీలు పూర్తిగా పాడై ఆరోగ్యశ్రీ ద్వారా డయాలసిస్ చికిత్స పొందుతున్నాడని, ఇటీవల బీపీ, షుగర్ పెరిగి కంటి సమస్యతో బాధపడుతున్నాడని తెలిపారు. ఇక్కడ వైద్యసేవలు బాగానే ఉన్నాయని, రోజూ దుగ్గొండి నుంచి రావాలంటే బస్సులో ఇబ్బందులు పడాల్సి వస్తుందని మొగిలయ్య భార్య కొముರమ్మ తెలిపినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. వచ్చివెళ్లేందుకు అంబులెన్స్ కూడా ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి మొగిలయ్యకు మంచి వైద్యసేవలు అందుతున్నాయని, మరేమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని, వారి రక్షణకు తెలంగాణ ప్రభుత్వం, తాము సిద్ధంగా ఉన్నామని మొగిలయ్య దంపతులకు సూపరింటెండెంట్ సూచించారు. సూపరింటెండెంట్ వెంట సంరక్ష వైద్యులు డాక్టర్లు మల్లేష్, దినేష్, సంరక్ష ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు నటరాజ్, భాస్కర్ ఉన్నారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం

రైతులకు న్యాయం చేస్తా..

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



కడియంతో లింగంపల్లి దళిత రైతులు

చిల్పూరు: అసైన్‌మెంట్ భూముల విషయంలో రైతులకు న్యాయం చేస్తానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. మండల పరిధి లింగంపల్లికి చెందిన 30 మంది దళిత రైతులు సర్పంచ్ ఏదునూరి రవీందర్ ఆధ్వర్యంలో కడియం శ్రీహరిని శనివారం హనుమకొండలోని గృహంలో కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవి, రైతులు మేక ఉప్పలయ్య, మోతె ఎల్లయ్య, జంగిటి ప్రభాకర్, బొట్టు యాదగిరి మాట్లాడుతూ.. గ్రామంలోని 443 సర్వే నంబర్‌లో 150 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉండగా.. 120 మంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని, 90 మందికి పట్టాబుక్కులు ఇవ్వగా రైతు బంధు కూడా అందుతోందని చెప్పారు. మిగతా 30 మందికి రాకపోవడంతో అధికారుల వద్దకు వెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. స్పందించిన కడియం.. కలెక్టర్ శివలింగయ్యకు ఫోన్ చేసి సమస్య వివరించగా 10 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పడంతో.. హక్కు పత్రాలతోపాటు రైతు బంధు అందేలా చేస్తానని కడియం హామీ ఇచ్చారు.

పకడ్బందీగా రెండో విడత గొర్రెల పంపిణీ

- వీసీలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



వీసీలో కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్

జనగామ: గొర్రెల పంపిణీ పథకం రెండో విడత కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెండో విడత గొర్రెల పంపిణీ, కంటి వెలుగు, ఆరోగ్య మహిళా, పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్రూంల నిర్మాణం, 58, 59, 76, 118 ప్రభుత్వ జీఓలతో క్రమబద్ధీకరణ, పోడు భూములపై సమీక్షించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ శివలింగయ్య సమీక్ష నిర్వహించారు. డీపీఓ రంగాచారి, హౌసింగ్ ఈఈ దామోదర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ రవీందర్, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ రజిత, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సుధీర్, పశు వైద్యాధికారి డాక్టర్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులపై టోల్ భారం

- హైదరాబాద్‌కు పెరిగిన ఆర్టీసీ చార్జీలు

హన్మకొండ: హైదరాబాద్–హనుమకొండ రూట్‌లో, అంతర్ రాష్ట్ర సర్వీసుల్లో ప్రయాణించే ఆర్టీసీ ప్రయాణికులపై టోల్‌భారం పడింది. దేశవ్యాప్తంగా పెంచిన టోల్ చార్జీలు శనివారం నుంచి అమల్లోకి రావడంతో అందుకనుగుణంగా టీఎస్ ఆర్టీసీ కూడా టికెట్ ధరలు పెంచింది. వరంగల్ రీజియన్ ప్రస్తుతానికి రోజూ రూ.4,00,100 టోల్ చార్జీలు చెల్లిస్తూ వస్తోంది. టోల్‌చార్జీల పెంపుతో సంస్థపై అదనంగా రోజుకు రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు భారం పడుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు హైదరాబాద్ రూట్‌లో రూ.10 చొప్పున బస్ చార్జీలను పెంచారు. ఈ చార్జీలు హనుమకొండ–హైదరాబాద్‌తోపాటు అంతర్ రాష్ట్ర సర్వీస్‌లపై వర్తిస్తాయని అధికారులు తెలిపారు. ఇతర రూట్‌లలో చార్జీలు పెంచలేదని స్పష్టం చేశారు.

హనుమకొండ–హైదరాబాద్ రూట్‌లో చార్జీల వివరాలు

సర్వీస్	పాతవి	కొత్తవి
గరుడ	420	430
రాజధాని	360	370
సూపర్ లగ్జరీ	270	280
డీలక్స్	240	250
ఎక్స్‌ప్రెస్	190	200 (ఉప్పల్‌కు)
ఎక్స్‌ప్రెస్	200	210 (ఎంజీబీఎస్‌కు)
పల్లె వెలుగు	150	160

అధిక ఫీజులను నియంత్రించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జనగామ రూరల్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. పలు యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయంటూ శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు యాజమాన్యాల తీరుతో పేద విద్యార్థులకు చదువు భారం అవుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని, భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని చెప్పారు. ఇన్‌చార్జ్ ఎంఈఓల పాలనతో సర్కారు చదువు కుంటుపడుతోందని, తక్షణమే పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాకూబ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విభజన సమయంలో పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రజాపోరు యాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం సమావేశంలో మాట్లాడుతూ.. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు ఏమైందని ప్రశ్నించారు. హామీల అమలుకు చేపట్టిన ప్రజాపోరు యాత్ర ఆదివారం చిల్పూరుకు, 3న జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, 11.00 గంటలకు నిర్వహించే బహిరంగ సభకు జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సుగుణమ్మ, సామన్న, శ్రీనివాస్, సోమయ్య, యాదగిరి, ఎల్లయ్య , రమేష్, మల్లేషం, రాములు, యాకూబ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కూలీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాజం

జనగామ రూరల్: వ్యవసాయ రంగంలో కీలక భూమిక పోషిస్తున్న మహిళా కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదునూరి వెంకట్రాజం డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళా కూలీలు సామాజిక వివక్షకు గురవుతున్నారని, వారిలో చైతన్యం తీసుకువచ్చి పోరాడేందుకు ఈనెల 20, 21 తేదీల్లో జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, ఇందుకు ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గౌరవ అధ్యక్షులుగా కడియం ఫౌండేషన్ చైర్మన్ కడియం కావ్య, అధ్యక్షులుగా దేవరుప్పుల జెడ్పీటీసీ పల్ల భార్గవి, చీఫ్ ప్యాట్రన్లుగా ఎంపీపీ బస్వ సావిత్రి, కేతిరెడ్డి ప్రత్యూష, ప్రధాన కార్యదర్శిగా వెంకట్రాజం, సహాయ కార్యదర్శులుగా సింగారపు రమేష్, ఎ.కుమార్, మహేందర్, ఉపేందర్, దుర్గాప్రసాద్, కిష్టయ్య, సరితను ఎంపిక చేసినట్లు తెలిపారు.

తాటిచెట్లు తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి



సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధి శివునిపల్లిలో కల్లు పారే తాటిచెట్లను అక్రమంగా తొలగించిన వారిపై చర్య తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గ్రామానికి చెందిన గీత కార్మికులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియకు శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ సర్వే నంబర్ 62లో గతనెల 19న రాత్రి కొందరు కల్లుపారే తాటిచెట్లను జేసీబీ సహాయంతో తొలగించారని, ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. 146 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న తాటిచెట్లను తొలగించడం దారుణమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీకేఎస్ నాయకులు వంగ శ్రీనివాస్, వంగ సురేష్, వంగ వేణు, తిరుపతి, నారాయణ, కుమారస్వామి, ఎల్లగౌడ్, పల్లె అశోక్, మహేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోయండి..

- పెరుగుతున్న గుండె పోటు మరణాలు
- కార్డియో పల్మోనరీ రిససిటేషన్‌తో ప్రాణాపాయం నుంచి కాపాడొచ్చు
- శిక్షణ ప్రారంభించిన కలెక్టర్
- ఆరు కేటగిరీలు.. 1,951 మందికి..



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్, పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎంహెచ్ఓ

జనగామ: ఆకస్మిక గుండెపోటు.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వదిలి పెట్టడం లేదు. కరోనా తర్వాత ఈ సంఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆటలు ఆడుతూ.. జిమ్ చేస్తూ.. అలసటకు గురై.. అక్కడిక్కడే కుప్పకూలి పోతున్నారు. గుండె పోటుతో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం కార్డియో పల్మోనరీ రిససిటేషన్(సీపీఆర్/పునర్జీవనం)పై అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య శాఖతోపాటు సామాన్య ప్రజలకు శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య.. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ రవీందర్‌గౌడ్‌తో కలిసి సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యారోగ్యశాఖలో పని చేసే మెడికల్ ఆఫీసర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, డీపీఎంఓ, సీహెచ్ఓ, ఎంపీహెచ్, పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఎస్(మహిళలు, పురుషులు) మొత్తం 123 మందికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూడు షిఫ్టుల్లో శిక్షణ ఇచ్చారు. గుండె పోటుకు గురై చనిపోయే వారిని ఎలా బతికించాలనే దానిపై డాక్టర్ మానస, డాక్టర్ ప్రణీత బొమ్మ ద్వారా సీపీఆర్ చేసి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

ఆరు కేటగిరీల వారికి శిక్షణ

జిల్లాలో 1,951 మంది వైద్య సిబ్బంది(ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు), పోలీసు శాఖ, పంచాయతీ, మున్సిపల్ స్టాఫ్, కమర్షియల్ దుకాణాలు, కాలనీలు, ఆర్టీసీ ఉద్యోగులకు మొత్తం ఆరు కేటగిరీల్లో సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకు ఆరుగురు డాక్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మండలాల పరిధి పీహెచ్‌సీల వారీగా సోమవారం(నేడు) నుంచి సీపీఆర్ శిక్షణ, అవగాహన సదస్సులు ప్రారంభం కానున్నాయి. రఘునాథపల్లి, కోమళ్లలో 196, లింగాలఘణపురం 111, దేవరుప్పుల 119, జనగామ అర్బన్ పీహెచ్‌సీ 641, బచ్చన్నపేట 123, నర్మెట 133, జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ 54, స్టేషన్‌ఘన్‌పూర్ 72, మల్కాపూర్ 104, తాటికొండ 31, ఇప్పగూడెం 36, కూనూరు 33, జఫర్‌గఢ్ 69, పాలకుర్తి 145, కొడకండ్ల 84 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రజల్లో అవగాహన కల్పించాలి : కలెక్టర్

సీపీఆర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై ఏర్పాటు చేసిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆకస్మిక గుండె పోటు మరణాలను సీపీఆర్‌తో నివారించే అవకాశం ఉందన్నారు. అలాగే మహిళల ఆరోగ్యం విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించిన ప్రభుత్వం ప్రతి మంగళవారం జిల్లా ఆస్పత్రి, పీహెచ్‌సీల్లో వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తోందని చెప్పారు. ఏఎన్ఎం, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు మహిళలకు అవగాహన కల్పించి సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ సుధీర్, డాక్టర్ అశోక్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ రాజు, డాక్టర్ కరుణాకర్ రాజు, జిల్లా సీపీఆర్ శిక్షకులు డాక్టర్ కమల హాసన్, డాక్టర్ రవితేజ, మానస, డాక్టర్ ప్రణీత, హరికృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్యను కొట్టిన భర్తపై కేసు నమోదు

ఖిలా వరంగల్: మద్యం తాగి భార్యను కొట్టిన భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కరీమాబాద్ దసరా రోడ్డుకు చెందిన మంద సరిత, భర్త శివకుమార్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివకుమార్ మెడికల్ రిప్రజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇంటికి వచ్చే సమయాన ఫుల్‌గా మద్యం తాగి వచ్చి భార్య సరితను తీవ్రంగా కొడుతున్నాడు. రోజు వారీగానే శనివారం సాయంత్రం 7.30 గంటలకు శివకుమార్ మద్యం తాగి ఇంటికి చేరుకున్నాడు. భార్య సరితతో గొడవ పడి కొట్టగా చేతికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో సరిత ఫిర్యాదు మేరకు శివకుమార్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరెస్ట్



వరంగల్ క్రైం: ఏటీఎం సెంటర్లలో మాటు వేసి అమాయకులను టార్గెట్ చేసుకుని కార్డులు మార్చేసి డబ్బులు డ్రా చేస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారుతెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన పుల్ల ప్రభాకర్ (28) మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈక్రమంలో ప్రభాకర్ ఏటీఎం సెంటర్లలో మాటు వేసి ఆమాయకులకు సాయం చేసినట్లు నటిస్తూ పిన్ కోడ్‌ను తెలుసుకుని కార్డు మార్చి వారి ఖాతాల్లోని డబ్బులు మాయం చేస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం ప్రభాకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పొదుపు పథకాలపై పెరిగిన వడ్డీ



- చిన్నమొత్తాల పొదుపులకు అవకాశం
- తపాలాశాఖలో అనేక పొదుపు పథకాలు

హన్మకొండ: చిన్న మొత్తాల పొదుపుపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ పెంచింది. చిన్న మొత్తాల పొదుపుపై 2023–24 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికిగాను తపాలాశాఖ వడ్డీ రేట్లు పెంచింది. 2023 ఏప్రిల్ నుంచి జూన్ వరకు పెరిగిన వడ్డీ రేట్లు వర్తిస్తాయి. వడ్డీ రేట్ల పెంపుతోపాటు ఎంపిక చేసిన పొదుపు ఖాతాలకు అత్యధిక పొదుపు పరిధిని సవరించారు. సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో అత్యధిక పొదుపుని రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు. ఈ స్కీంలో మూడు నెలలకోసారి 8శాతం వడ్డీ పొందవచ్చు. మంత్లీ ఇన్‌కమ్ స్కీంలో వ్యక్తిగత ఖాతాలో అత్యధిక పొదుపుని రూ.4.5లక్షల నుంచి రూ.9లక్షలకు, జాయింట్ ఖాతాలో అత్యధిక పొదుపుని రూ.9లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచారు. ఈ స్కీంలో నెలకు ఒకసారి 6.7 శాతం వడ్డీ పొందవచ్చు. మహిళా సమ్మాన్ బచత్ పత్ర పేరుతో ఒక కొత్త స్కీంను మహిళలు, ఆడపిల్లల కోసం వన్ టైం స్మాల్ సేవింగ్ స్కీంగా ప్రవేశపెట్టారు. ఈ స్కీంలో మార్చి–2025 వరకు చేరవచ్చు. ఇందులో అత్యధికంగా రూ.2లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చు. కాల పరిమితి 2 సంవత్సరాలు కాగా, వడ్డీ 7.5శాతంగా నిర్ణయించారు. పాక్షిక నగదు ఉపసంహరణకు కూడా అవకాశం కల్పించారు.

వడ్డీ వివరాలు..

పొదుపు ఖాతా	వడ్డీ
సేవింగ్స్ అకౌంట్	4 శాతం
రికరింగ్ డిపాజిట్	6.2
మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్	7.4
టైమ్ డిపాజిట్ ఒక సంవత్సరం	6.8
టైమ్ డిపాజిట్ 2 సంవత్సరాలు	6.9
టైమ్ డిపాజిట్ 3 సంవత్సరాలు	7
టైమ్ డిపాజిట్ 5 సంవత్సరాలు	7.5
సుకన్య సమృద్ధి ఖాతా	8
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.1
సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్	8.2
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్	7.7
కిసాన్ వికాస్ పత్ర 115 నెలలు	7.5

పథకాల్లో చేరి అధిక వడ్డీ పొందండి



తపాలా శాఖ పొదుపు పథకాలపై పెంచిన వడ్డీ సౌకర్యాన్ని ఖాతాదారులు అందిపుచ్చుకోవాలి. మూడు నెలల కాలానికి వడ్డీ రేట్లు పెంచాం. అదే విధంగా పొదుపు చేసే మొత్తాన్ని కూడా పెంచాం. ఏ ఇతర బ్యాంకుల్లో లేని విధంగా అత్యధిక వడ్డీ రేటు తపాలా శాఖ పొదుపు ఖాతాలపై చెల్లిస్తుంది.

– బానోతు నందా, తపాలా సూపరింటెండెంట్, హనుమకొండ డివిజన్

ఆకతాయిలను పట్టుకున్న షీ టీం బృందం

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్‌లోని కాకతీయ జూపార్క్‌లో అమ్మాయిలు, మహిళలను ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న షీ టీం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రెక్కి నిర్వహించి పది మందిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం షీ టీం పనిచేస్తుందన్నారు. ఎలాంటి సమయాల్లోనైనా మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాట్సాప్, ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్, సామాజిక మధ్యమాల్లో మహిళలపై అసభ్యకరంగా, గౌరవానికి భంగం కలిగించే వారిపై చర్యలు ఉంటాయన్నారు. అకతాయిల సమాచారం ఇవ్వాలనుకుంటే 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు. బృందంలో ఎస్సైలు కుమారస్వామి, విద్యాసాగర్, స్వాతి, ఏఎస్సై వేణుగోపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరేందర్, బీచ్యానాయక్, కానిస్టేబుల్స్ వంశీక్రిష్ణ, పూర్ణ ఉన్నారు.



ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాలి

కేయూ క్యాంపస్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటంఆడిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కమిటీ సభ్యులను అరెస్టు చేయకుండా అవినీతిపైన ప్రశ్నించిన కేయూ జేఏసీ నేతలపై కేసులు పెట్టించిన వీసీ, రిజిస్ట్రార్‌లు తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి, కేయూ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ మంద వీరస్వామి డిమాండ్ చేశారు. శనివారం కేయూ జేఏసీ నేతలను పరామర్శించిన అనంతరం కేయూ జేఏసీ అధ్యక్షుడు తూము నవీన్, చైర్మన్ తిరుపతియాదవ్‌లతో కలిసి మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ గేట్‌వద్ద తమ నిరసన తెలిపారు. కేసులను ఉపసంహరించుకుంటారో.. రాజీనామా చేస్తారో.. ఆలోచించుకోవాలన్నారు. యూనివర్సిటీలకు ఉన్న స్వయంప్రతిపత్తిని రాష్ట్ర ప్రభుత్వం, వీసీలు దెబ్బకొడుతున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణాలోని అన్ని యూనివర్సిటీల్లోని విద్యార్థి నాయకులను చైతన్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీలను ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థి, నిరుద్యోగుకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే టీఎస్‌జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో గిరిజనశక్తి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజునాయక్, టీజేవీపీ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కళ్లెపెల్లి ప్రశాంత్, బీసీ విద్యార్థిసంఘం ఇన్‌చార్జ్ నాగరాజు, వంశీ, మనోహర్, రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఓయూ, కేయూ జేఏసీ నేతలు

కేయూలో తరగతుల బహిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులపై అక్రమ కేసులు పెట్టారని నిరసిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం విధితమే. అయితే శనివారం యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో తరగతులు జరుగుతుండగా బంద్‌లో భాగంగా ఆయా విభాగాల వద్దకు వెళ్లి ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ క్యాంపస్‌లోని ఫార్మసీ, ఫిజిక్స్, మ్యాథ్స్, బీపీఈడీ విభాగాల్లో తరగతులను బహిష్కరింపచేశారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మంద నరేష్‌ను అరెస్టు చేశారు. అనంతరం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువతకు అన్యాయం చేశారన్నారు. విద్యార్థిసంఘాల బాధ్యులపై పెట్టిన అక్రమ కేసులు వెనక్కితీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసనలో ఏబీఎస్ఎఫ్ నాయకులు మచ్చ పవన్‌కల్యాణ్, పంగిడిపెల్లి పవన్, మధుగౌడ్, హెచ్ భరత్, వినయ్, సాయిప్రదీప్, వెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.



కేయూలో నిరసన తెలుపుతున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

క్యాంపస్‌ను వీడని పోలీసులు

కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేసిన నేపథ్యంలో శనివారం కూడా క్యాంపస్‌లో పరిపాలన భవనంతోపాటు పలు చోట్ల పోలీసులు మోహరించారు. ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. కాగా, గత రెండు రోజులుగా పోలీసులు క్యాంపస్‌ను వీడకపోవడం గమనార్హం.

గేదెలు ఇచ్చే వరకు కదలం

నర్సంపేట/ఆత్మకూరు: నచ్చిన గేదెలను కొనుగోలు చేసి ఇచ్చే వరకు హర్యానా నుంచి తెలంగాణకు వచ్చేదిలేదని లబ్ధిదారులు మాదాసి సురేష్, గంగారపు లింగయ్య, పరికి కోర్నెలు, అన్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ అధికారుల మనసు కరగాలని కోరుతూ శనివారం లబ్ధిదారులు హర్యానాలో దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లబ్ధిదారులను హర్యానాలోనే వదిలేసి తిరుగు ప్రయాణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మినీ డైరీ ప్రాజెక్టు కింద దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిందని, అధికారుల కమీషన్ల కక్కుర్తితో పక్కదారి పడుతుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు సురేష్‌కుమార్, మాధవిలత, సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నచ్చిన గేదెలను కొనుగోలు చేయకుండా గత వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అధికారుల కమీషన్ల దాహానికి దళితులను బలి చేస్తారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వేల్పుగొండ నర్సయ్య, మందపల్లి శ్రీనివాస్, మందపల్లి నర్సయ్య, కొమ్ము వెంకన్న, మన్నె మల్లయ్య, మాదాసి స్వామి, గిన్నారపు మైబు, తదితరులు పాల్గొన్నారు.



దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

కూతుళ్లు భరోసా ఇచ్చినా..

- కుటుంబాన్ని ఇబ్బంది పెట్టలేక ఆర్ఎంపీ బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులే కారణం



జమాలుద్దీన్ (ఫైల్)

తొర్రూరు: 'నాన్నా.. మేము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తాం. మీరేమీ బాధపడొద్దు. ఎటువంటి అఘాయిత్యం చేసుకోవద్దు' అని ఇద్దరు కూతుళ్లు భరోసా ఇచ్చారు. అయినా అతని మనస్సు వినలేదు. అప్పులతో కుటుంబాన్ని ఇబ్బంది పెట్టొద్దని భావించిన ఓ ఆర్ఎంపీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో శనివారం చోటుచేసుకుంది. అదనపు ఎస్సై లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అర్వపల్లికి చెందిన ఎండీ జమాలుద్దీన్ (46) కొన్నేళ్ల క్రితం తొర్రూరుకు వచ్చి స్థిరపడ్డాడు. పట్టణంతో పాటు మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఆర్ఎంపీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు మదీనా, రిజ్వానా ఉన్నారు. మదీనా డిగ్రీ పూర్తికాగా, రిజ్వానా ఇటీవల ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాసింది. వారి విద్య, ఇంటి అవసరాల నిమిత్తం రూ.15లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు డబ్బుల కోసం ఒత్తిడి చేస్తుండడంతో తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో చావే శరణ్యమని తలచాడు. కుటుంబంతో సైతం పలుమార్లు ఈ విషయంపై తన ఆవేదనను వెల్లిబుచ్చగా తాము ఉద్యోగాలు చేసి అప్పులు తీరుస్తామని కూతుళ్లు భరోసానిచ్చారు. తీసుకున్న అప్పు, వడ్డీలు కట్టలేనని భావించి, కుటుంబాన్ని ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనుంచి బయటికి వచ్చిన జమాలుద్దీన్ అర్ధరాత్రి వరకు కూడా తిరిగి రాలేదు. భార్య ఫోన్‌కు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మెసేజ్ చేశాడు. ఆందోళన చెందిన భార్య పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. కుటుంబ సభ్యులు వెతకగా శనివారం ఉదయం స్థానిక వ్యవసాయ మార్కెట్ సమీపంలో విగతజీవిగా కనిపించాడు. మృతుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య గౌసియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'పత్తి' సాగులో జాగ్రత్తలు పాటించాలి

- శాస్త్రవేత్త డాక్టర్ రామ్‌ప్రసాద్

స్టేషన్‌ఘన్‌పూర్: పత్తి పంట సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.రామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వరంగల్ వారి ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక 2022–23లో భాగంగా ×పత్తి పంట సాగులో మెలకువలు₹ అనే అంశంపై ఎస్సీ రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పత్తిని నీటి వసతి గల ప్రాంతాల్లో మే నెలాఖరులోగా వేయాలన్నారు. వానాకాలంలో జూన్ 15వ తేదీలోగా విత్తినచో అధిక దిగుబడులు వస్తాయని, జూలై 20 తర్వాత విత్తినచో దిగుబడులు తగ్గుతాయన్నారు. చెలక నేలలలో పత్తిని అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేస్తే ఎకరానికి 9 నుంచి 13 క్వింటాళ్ల పత్తి దిగుబడి పొందవచ్చన్నారు. పత్తిసాగుకు దుక్కిలో 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌నుగాని, 50 కిలోల డీఏపీని దుక్కిలో వేసుకోవాలన్నారు. యాసంగిలో పత్తి వేయొద్దని, అధిక చీడ పీడలు ఆశించడం కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గుతుందన్నారు. అనంతరం రైతులకు పత్తిసాగులో వాడే సస్యరక్షణ మందులను, జిగురు అట్టలను, నీటిలో కరిగే పోషకాలను ఉచితంగా అందించారన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంత్, బి.మాధవి, డి.అశ్విని, డాక్టర్ బి.అనీల్‌కుమార్, స్థానిక సర్పంచ్ నాగరబోయిన మణెమ్మయాదగిరి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ కేశరాజు నరహరి, వార్డు సభ్యుడు పసుల రమేష్, దేశ్‌పాండే ఫౌండేషన్ టీమ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, జోగు కుమార్, జోగు థామస్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామ్‌ప్రసాద్

పది నిమిషాల్లో గమ్యం చేరుతాడనగా..

డీసీఎం రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రాజేందర్ మృతదేహం

హసన్‌పర్తి: పదినిమిషాల్లో గమ్యస్థానం చేరుతాడనగా.. ఓ వ్యక్తిని డీసీఎం రూపంలో మృత్యువు కబళించింది. యాదాద్రి– ఆరెపల్లి జాతీయ రహదారిలోని పెగడపల్లి వద్ద శనివారం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన సతూరి రాజేందర్ (45)కు భార్య స్వరూప, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భార్యభర్తలు ఓ ప్రైవేట్ పాఠశాలలో వంట చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. స్వరూప ఇటీవల కూతుళ్లతో వరంగల్ జిల్లా పైడిపల్లిలోని తల్లిగారింటికి వెళ్లింది. ఈక్రమంలో భార్య పిల్లలను తీసుకొచ్చేందుకు రాజేందర్ దామెర నుంచి బైక్‌పై పైడిపల్లికి బయల్దేరాడు. ఈక్రమంలో జాతీయ రహదారిపై వెనుకవైపు నుంచి వస్తున్న డీసీఎం– బైక్‌పై నుంచి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ఇదిలా ఉండగా.. రాజేందర్ మృతికి కారణమైన డీసీఎం యజమాని పరిహారం చెల్లించాలని రాజేందర్ బంధువులు డిమాండ్ చేస్తున్నారు. పరిహారం ఇప్పిస్తేనే మృతదేహాన్ని తీసుకెళ్తామని కుటుంబ సభ్యులు పట్టుపట్టడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

బావిలోపడి వ్యక్తి మృతి



యాదగిరి(ఫైల్)

వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లికి చెందిన ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందాడు. ఎస్సై రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. గుళ్లపెల్లి యాదగిరి(58) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. సంవత్సర కాలంగా తాగుడుకు బానిసైన యాదగిరి గురువారం ఉదయం వాళ్ల బయటకు వెళ్లివస్తానని అమ్మకు చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వాకబు చేసి, శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో శనివారం గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో యాదగిరి మృతదేహంపైకి తేలి ఉన్నట్లు గుర్తించిన రైతు యాదగిరి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు.

లిమిట్ పెంచుతామని దోచేశారు..

- క్రెడిట్ కార్డు పేరుతో సైబర్ మోసం
- లబోదిబోమంటున్న బాధితుడు



ఖిలా వరంగల్: మొబైల్ ఫోన్‌కు ఓటీపీ పంపించి బ్యాంకు ఖాతాల్లో నగదు లాగేస్తున్న సైబర్ కేటుగాళ్లు ఇప్పుడు రూటు మార్చారు. అమాయక ప్రజల ఖాతాలపై కన్ను వేశారు. సైబర్ నేరగాళ్లు ఓటీపీ, ఎస్ఎంఎస్ లేకుండానే ఎనీడెస్క్ యాప్ ద్వారా ఖాతాను పూర్తిగా ఖాళీ చేసిన ఘటన వరంగల్‌లో వెలుగుచూసింది. మార్చి 22న వరంగల్ కరీమాబాద్‌కు చెందిన మహమ్మద్ హైమద్ అలీకి పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి కాల్ వచ్చింది. మీకు క్రెడిట్ కార్డు ఉందా.. ఉంటే ఎంత లిమిట్ ఉంది.. అని అడిగారు. బాధితుడు కార్డుకు రూ.25వేలు లిమిట్ ఉందని చెప్పగా.. కార్డు లిమిట్ రూ.70వేలకు పెంచుతున్నామని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. లిమిట్ పెంచాలంటే మొబైల్ ప్లే స్టోర్ నుంచి ఎనీడెస్క్ యాప్ డౌన్‌లోడు చేసుకొమ్మని చెప్పారు. వారి మాటలు నమ్మిన బాధితడు మొబైల్‌లో ఎనీడెస్క్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆ వెంటనే మొబైల్ సైబర్ నేరగాడు చేతిలోకి స్క్రీన్ తీసుకున్నాడు. ఖాతా వివరాలు నమోదు చేస్తున్నామంటూ బాధితుడిని నమ్మించారు. మొబైల్‌కు వచ్చిన ఐడీ నంబర్ చెప్పగానే హెచ్‌డీఎఫ్ బ్యాంకు ఖాతాలోని రూ.17,770 లాగేసుకున్నాడు. మొబైల్‌కు వచ్చిన మెసేజ్ చూసి ఖాతాలోని నిల్వ మాయమైందని గ్రహించి వెంటనే సైబర్ క్రైమ్ కార్యాలయానికి కాల్ చేసి బాధితుడు వివరాలు చెప్పాడు. కానీ, అప్పటికే ఖాతాల్లో డబ్బులు మాయమయ్యాయి. ఈక్రమంలో శనివారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

శివనగర్‌లో బైక్ చోరీ

ఖిలా వరంగల్: ఓ షాపు ఎదుట శుక్రవారం సాయంత్రం పార్క్ చేసిన టీ.ఎస్ 24 1764 నంబర్ హీరో గ్లామర్ బైక్ చోరీకి గురైంది. వరంగల్ 34వ డివిజన్ శివనగర్ ఏరియాలోని పల్లవి ఆస్పత్రి లేన్‌లో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శివనగర్‌కు చెందిన మన్నెం ఆదినారాయణ(48) శుక్రవారం రాత్రి పార్క్ చేసిన బైక్ శనివారం ఉదయం కనిపించేదు. దీంతో శనివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.